సాక్షి
జోగులాంబ గద్వాల
గురువారం । 12 । డిసెంబర్ । 2024



స్టోన్ క్రషర్‌కు కరెంట్ కట్

జడ్చర్ల శివారులో స్టోన్ క్రషర్ యూనిట్‌కు అధికారులు కరెంట్ కట్ చేశారు.

వివరాలు 10లో ▸



ఉల్లిధర పైపైకి..

దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లిపాయల ధరలు మరింత పెరిగాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.6 /18.8

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఎండ, రాత్రివేళ చలి ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

హాస్టళ్లలో నాణ్యతలేని ఆహారం



గద్వాల అర్బన్: జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో నాణ్యతలేని ఆహారం అందిస్తుండటంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్–బీని సందర్శించి, సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. అదే విధంగా హాస్టళ్ల గదుల కిటికీలకు తలుపులు లేకపోవడంతో దోమకాటుకు గురై వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. కొన్ని వసతిగృహాల్లో సరైన బాత్‌రూంలు లేవన్నారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరేష్, కిరణ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం : ఎస్పీ



గద్వాల క్రైం: క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన వాలీబాల్ కోర్టును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధుల నిర్వహణలో నిత్యం ఒత్తిడికి గురయ్యే పోలీసు సిబ్బంది క్రీడలకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. క్రీడలతో శారీరకంగా ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నరేందర్‌రావు, సిబ్బంది నాగేశ్వర్ రెడ్డి, వెంకటేష్, రామకృష్ణ, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



గద్వాలటౌన్: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వివిధ ఉపాధ్యాయ సంఘాలు, పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి మాట్లాడుతూ.. సమగ్రశిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు పద్ధతిన 20 ఏళ్లుగా పనిచేస్తూ గురుకులాలతో సమానంగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నా.. శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు. సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయకుంటే ప్రభుత్వంపై సమరం సాగిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ.. సుప్రీం తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖలోని సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు హుస్సేనప్ప, గోపాల్, ఎస్ఓలు శ్రీదేవి, ఆసియాబేగం, అనురాధ, పద్మావతి, గోమతి, పద్మ పాల్గొన్నారు.

● చేతులెత్తేశారు..

'తెల్ల'బోతున్నారు..

పత్తి రైతులకు శాపంగా మారిన తేమ కొర్రీలు



ఉండవెల్లిలో పత్తిని కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యాపారులు

సాక్షి ఫోకస్

- కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్న సీసీఐ అధికారులు
- జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులకు పరోక్ష సహకారం
- తక్కువ ధర చెల్లిస్తూ దండుకుంటున్న వ్యాపారులు
- లబోదిబోమని మొత్తుకుంటున్న రైతులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గతేడాది పత్తికి ప్రభుత్వ మద్దతు ధరకు మించి ధర పలకడంతో ఈ ఖరీఫ్‌లో రైతులు ఆ పంట వైపే మొగ్గు చూపారు. కానీ వారి ఆశలు అడియాసలుగా మారాయి. వరుస వర్షాలు, తెగుళ్లతో దిగుబడి గణనీయంగా తగ్గింది. పెట్టుబడి అయినా వస్తుందని భావించిన రైతులు అనేక కష్టనష్టాలకు ఓర్చి కూలీల కొరతను సైతం అధిగమించారు. చివరకు పత్తిని విక్రయించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాలకు వచ్చిన వారిని తేమ, వ్యర్థాల పేరిట కొర్రీలు వెక్కిరిస్తున్నాయి. కొనుగోలు చేయకుండా అధికారులు చేతులెత్తేయగా.. దీన్ని సాకుగా చేసుకుని దళారులు తక్కువ ధరతో కొనుగోలు చేస్తుండడంతో రైతులు తెల్లబోక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లాలో పత్తి రైతుల దీనావస్థపై 'సాక్షి' ఫోకస్..

కొనుగోళ్లలో జాప్యం.. కొర్రీలు

పత్తి జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో అధికారులు పత్తి నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో కొనుగోలు ప్రక్రియ ఆలస్యం అవుతోంది. అంతేకాకుండా శని, ఆదివారాల్లో సీసీఐ కేంద్రాలకు సెలవు ఉండడంతో మిగతా రోజుల్లో జిన్నింగ్ మిల్లుల వద్ద వాహనాలు బారులుదీరుతున్నాయి. తేమ 12 శాతం లోపే ఉండాలని.. వ్యర్థాలు ఉండొద్దనే కొర్రీలతో పత్తిని అసలు పరీక్షించకుండానే తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది. నారాయణపేట జిల్లా మాగనూరు మండలం వడ్వాట్ శివారులోని బసవేశ్వర జిన్నింగ్ మిల్లు వద్ద రైతులు మంగళవారం నిరసన తెలపడం ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది.

జిల్లాల వారీగా పత్తి సాగు, కొనుగోళ్ల తీరు ఇలా..

జిల్లా	సాగు (ఎకరాలు)	దిగుబడి అంచనా (క్వింటాళ్లు)	సీసీఐ కొనుగోళ్లు (క్వింటాళ్లు)
నాగర్‌కర్నూల్	2,08,072	19,80,000	9,00,000
నారాయణపేట	1,65,150	9,90,900	2,01,136
జో. గద్వాల	1,29,000	12,91,000	36,400
మహబూబ్‌నగర్	81,277	6,79,150	74,944
వనపర్తి	14,383	1,28,190	36,478

వ్యాపారులకు అధికారుల పరోక్ష మద్దతు..

సీసీఐ యంత్రాంగం కొనుగోళ్లలో కావాలనే జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. తేమ శాతం, వ్యర్థాలు అంటూ యంత్రాల ద్వారా నాణ్యతను పరీక్షించేందుకు అధికారులు ఎక్కువ సమయం తీసుకుంటున్నారు. చివరకు తేమ శాతం ఎక్కువ ఉంది.. పత్తి నల్లగా ఉంది వంటి కొర్రీలతో కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్నారు. దీన్ని సాకుగా చేసుకుని జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు, దళారులు రైతుల నుంచి తక్కువ ధరతో పత్తిని కొనుగోలు చేస్తున్నారు. పత్తి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521–రూ.7,220.16 (తేమ 8–12 శాతం) ఉండగా, వ్యాపారులు క్వింటాల్‌కు రూ.5,600 నుంచి రూ. 6,400 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఇలా సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు అత్యధికంగా దళారులే పత్తిని కొనుగోలు చేశారు. కొనుగోళ్లలో జాప్యం, కొర్రీల నేపథ్యంలో సీసీఐ యంత్రాంగంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీసీఐ యంత్రాంగమే పరోక్షంగా వ్యాపారులకు సహకరిస్తోందని.. వారికి వ్యాపారులు కమీషన్ ఇస్తున్నారని.. వారి వ్యవహార శైలినే ఇందుకు నిదర్శనమని రైతులు ఆరోపిస్తున్నారు.

➪ మహబూబ్‌నగర్ జిల్లాలోని మూడు సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 3,064 మంది రైతుల నుంచి 74,944 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఇందులో మహబూబ్‌నగర్ రూరల్ మండలం ఓబ్లాయిపల్లి గ్రామ శివారులోని శ్రీ బాలాజీ ఇండస్ట్రియల్ కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన కేంద్రంలో 1,312 మంది రైతుల నుంచి 32,819 క్వింటాళ్ల పత్తి సేకరించారు. బాదేపల్లిలోని పద్మనాభ కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన కేంద్రంలో 1,233 మంది రైతుల నుంచి 31,343 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. మహేష్ కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన కేంద్రంలో 519 మంది రైతుల నుంచి 10,783 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 3 లక్షల క్వింటాళ్ల మేర దళారులు తక్కువ ధరతో కొనుగోలు చేసినట్లు రైతు సంఘాల అంచనా.

➪ నాగర్‌కర్నూల్ జిల్లాలో 18 సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోళ్ల లక్ష్యం 16 లక్షల క్వింటాళ్లు కాగా.. ఇప్పటి వరకు 9 లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేశారు. దళారులు ఇప్పటివరకు 4 లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు అంచనా. దళారులు ప్రభుత్వ మద్దతు ధర కంటే క్వింటాల్‌కు రూ.800 నుంచి రూ.1,300 తక్కువగా కొనుగోలు చేసినట్లు రైతులు చెబుతున్నారు.

➪ నారాయణపేట జిల్లాలో ఆరు సీసీఐ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 2,01,136 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. మరో నాలుగు లక్షల క్వింటాళ్లు దళారులు కొన్నట్లు అంచనా. అదేవిధంగా జోగులాంబ గద్వాల జిల్లాలో ఒక సీసీఐ సెంటర్ ద్వారా ఇప్పటివరకు 36,400 క్వింటాళ్లు కొన్నారు. మరో నాలుగు లక్షల క్వింటాళ్ల వరకు వ్యాపారులు కొన్నట్లు రైతుల ద్వారా తెలిసింది. వనపర్తి జిల్లాకు సంబంధించి ఒక సీసీఐ సెంటర్ ద్వారా ఇప్పటివరకు 1,473 మంది రైతుల నుంచి 36,478 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. రైతుల నుంచి మరో 40 వేల క్వింటాళ్ల పత్తిని దళారులు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

30 కి.మీ. నుంచి వచ్చాం..



జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం అలంపూర్ నియోజకవర్గం ఉండవెల్లి మండలంలోనే ఉంది. 30 క్వింటాళ్ల పత్తి పండగా బొలెరో వాహనంలో రూ.4,500 అద్దె, పత్తి ఎత్తడానికి కూలీలకు రూ.3 వేలు చెల్లించి తరలించాల్సి వచ్చింది. కాని ఇక్కడ కేవలం క్వింటాకు రూ.7,400 మాత్రమే చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

– వెంకట్రాముడు, రైతు, ఎల్కూరు (మల్దకల్)

దళారులకే అమ్మేశా..



పండించిన పత్తిని నిల్వ చేయలేక రూ.6,900కే దళారులకు అమ్మేశా. సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభించే సమయం తెలియక రూ.20 వేలు నష్టపోయా.

– గిర్దారెడ్డి, ధర్మవరం (ఇటిక్యాల)

తేమ 12 శాతం లోపు ఉండాలి..



రైతులకు మద్దతు ధర కల్పించేందుకు సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. మద్దతు ధర లభించాలంటే పత్తిలో తేమ 12 శాతం లోపు ఉండాలి. కొంతమంది నీళ్లు చల్లి తెస్తున్నారు. ఇలాంటి చర్యల వల్ల మద్దతు ధరకు కొనుగోలు చేయలేకపోతున్నాం.

– బాలామణి, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి, మహబూబ్‌నగర్

ప్రైవేటులోనే అమ్ముకున్నాం..



నేను ఈ సారి 6 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేశాను. ఎకరాకు రూ.40 వేల చొప్పున పెట్టుబడి ఖర్చు అయింది. పంటను సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే మద్దతు ధర ఇవ్వడం లేదు. తేమ శాతం, కాయ వచ్చిందని సాకులు చెబుతూ ధర తగ్గిస్తున్నారు. దీంతో మిల్లులోనే ప్రైవేటు వ్యాపారులకు రూ.6,400 చొప్పున పంటను అమ్ముకున్నాను.

– రాములు, కౌలురైతు, నందివడ్డెమాన్, బిజినేపల్లి మండలం

ధరలు తగ్గిస్తున్నారు..



8 ఎకరాల్లో పత్తి సాగు చేశా. పండిన పంటను ట్రాక్టర్‌లో గుడిగండ్ల జిన్నింగ్ మిల్లుకు తీసుకొచ్చా. క్వింటాకు రూ.7,500 చెల్లించాల్సి ఉండగా.. రూ.7,300 మాత్రమే ఇచ్చారు. ప్రైవేటుకు వెళ్తే తూకం, ధరలో మోసం ఉంటుందని ఇక్కడికి వస్తే కేంద్రంలోనూ అదే పని చేస్తున్నారు. ఇదేమిటని అడిగితే తేమ శాతం, చెత్త అంటూ లేనిపోని కారణాలు చెప్పి కష్టాన్ని దోచుకుంటున్నారు.

– లక్ష్మన్న, రైతు, మదన్‌పల్లి (మక్తల్)



మరికల్‌లో పత్తిని సేకరించిన దళారులు

అందరికీ ఆదర్శంగా నిలవాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

- ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ, కష్టపడే తత్వం ఉండాలి
- కలెక్టర్ బీఎం సంతోష్

ఎర్రవల్లి: ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాన్ని గౌరవించి, క్రమశిక్షణతో చదువుకోవాలని.. అందరికీ రోల్‌మోడల్‌గా నిలవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి బీసీ బాలుర గురుకులంలో మంగళవారం రాత్రి బస చేసిన కలెక్టర్.. బుధవారం ఉదయం విద్యార్థులతో కలిసి దినచర్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విద్యార్థులతో పరస్పర సంభాషణ నిర్వహించారు. తరగతి గదులు, హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే క్రమశిక్షణ, కష్టపడే తత్వంతో పాటు తమపై తమకు పూర్తి నమ్మకం ఉండాలన్నారు. మంచి ఫలితాలు సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. హార్డ్‌వర్క్ మాత్రమే కాదు.. స్మార్ట్ వర్క్ కూడా ఈ రోజుల్లో చాలా అవసరమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు దాన్ని అర్థం, ప్రాధాన్యతను కూడా తెలుసుకోవాలని.. భవిష్యత్‌లో ఆ విషయాలు ఎలా ఉపయోగపడతాయో గుర్తించాలని సూచించారు. గొప్ప స్థాయిలో ఉన్న సీనియర్లను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదువుతూ.. రివిజన్, మోడల్ పేపర్ల ద్వారా ప్రాక్టీస్ చేయాలన్నారు. ఉదయం, రాత్రి స్టడీ అవర్స్‌ను పూర్తిగా ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ సంవత్సరం పాఠశాలలో 10/10 జీపీఏతో కనీసం ఐదుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలన్నారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తామన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం ముఖ్యమని.. రోజు వ్యాయామం చేయాలన్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హుల గుర్తింపు కోసం చేపట్టిన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. ఎర్రవల్లి మండలం కొండేరులో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లను వారు సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. సొంత ఇల్లు ఉందా.. లేదా.. పాత ఇంట్లో నివాసముంటున్నారా.. ఇంట్లో వివాహిత జంటల సంఖ్య, ప్రస్తుతం నివాసముంటున్న యజమాని ఎవరు తదితర అంశాలను పరిశీలిస్తూ మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన..

ఐకేపీ ఆధ్వర్యంలో కొండేరులో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని.. రైతుల వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ చేపట్టాలన్నారు. 24 గంటల్లో ఓపీఎంఎస్‌లో అప్‌డేట్ అయ్యేలా చూడాలని తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీపీఓ శ్యాం సుందర్, అడిషనల్ డీఆర్డీఓ నర్సింహులు, ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ తదితరులు ఉన్నారు.

గణితంపై ఆసక్తి పెంపొందించేలా బోధన

గద్వాలటౌన్: గణితంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేలా బోధన చేయాలని డీఈఓ అబ్దుల్ ఘని ఉపాధ్యాయులకు సూచించారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. సాయంత్రం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన బహుమతుల ప్రధానోత్సవానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిత్య జీవితంలో గణితం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమన్నారు. గణితం అన్ని సబ్జెక్టులకు తల్లివంటిదని చెప్పారు. లెక్కలు సులువుగా చేసేందుకు అనువైన పద్ధతులను విద్యార్థులకు వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమోంటోలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.

విజేతలు వీరే..

తెలుగు మీడియంలో తనగల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సుమంజలి, పులికల్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని అనూష, తనగల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని హరిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులను అందుకున్నారు. ఇంగ్లిష్ మీడియంలో గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వినయ్ ప్రథమ, శివసాయి ద్వితీయ, హర్షిత తృతీయ స్థానాల్లో నిలిచారు. అనంతరం తెలంగాణ మ్యాథ్స్ ఫోరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వరద సుందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అనిత, ఉపాధ్యక్షుడిగా బస్వరాజు, సంయుక్త కార్యదర్శిగా ఆగస్టీన్, కోశాధికారిగా సమరసింహారెడ్డి, గౌరవాధ్యక్షుడిగా విష్ణు, సలహాదారుడిగా జహురుద్దీన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర పరిశీలకుడు శోభారాణి, జహురుద్దీన్, కృష్ణ పాల్గొన్నారు.



విద్యార్థులకు మెమోంటో, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఈఓ అబ్దుల్ ఘని

మయూర వాహనంపై ఊరేగిన వెంకన్న





మయూర వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీవేంకటేశ్వరస్వామి, వేదపాఠశాలలో సంస్థాన పూజలు చేస్తున్న ఉడిపి ఫలిమార్ పీఠాధిపతి విద్యాధీశ తీర్థస్వామి

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం స్వామి వారికి బలిహరణం, పంచామృతాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, బ్యాండ్ భజంత్రీల మధ్య మయూర వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. మయూర వాహనంలో స్వామి వారిని ఆలయ నుంచి దళమికట్ట వరకు ఊరేగించి పూజలు చేశారు.

ఉడిపి ఫలిమార్ పీఠాధిపతి పూజలు

ఆదిశిలా క్షేత్రంలోని వేదపాఠశాలలో ఉడిపి ఫలిమార్ పీఠాధిపతి విద్యాధీశ తీర్థస్వామి సంస్థాన పూజలు నిర్వహించారు. అంతకు ముందు పీఠాధిపతికి ఆలయ చైర్మన్, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజల అనంతరం పీఠాధిపతి మాట్లాడుతూ.. ఆదిశిలా క్షేత్రంలో స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావించాలని భక్తులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, అర్చకులు, నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



ఎర్రవల్లి: బాల్యదశ నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకుసాగాలని జిల్లా సంక్షేమ అధికారిణి సునంద సూచించారు.బుధవారం ఎర్రవల్లిలోని పదో పటాలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కెరీర్ ప్లానింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. 14ఏళ్లలోపు బాలబాలికలు తప్పనిసరిగా బడిలోనే ఉండాలన్నారు. బాలబాలికలతో ఎవరైనా పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. డీసీపీఓ నర్సింహ, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ జ్యోత్స్న, హెచ్ఎం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ సీఈఓ కాంతమ్మ

మల్దకల్: గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణించి మంచిపేరు తెచ్చుకోవాలని జెడ్పీ సీఈఓ కాంతమ్మ సూచించారు. బుధవారం మల్దకల్‌లో మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు ఆసక్తిగల క్రీడలో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. మండల, జిల్లాస్థాయి క్రీడా పోటీల్లోనే కాకుండా రాష్ట్ర, జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. అనంతరం మండలస్థాయి వాలీబాల్, ఖోఖో కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జుబేర్ మొహినుద్దీన్, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, ఎంపీఓ రాజశేఖర్, ఎస్ఐ నందికర్, నాయకులు తిమ్మారెడ్డి, మాజీ సర్పంచ్ యాకోబు, బీఎస్ ఆనంద్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కృష్ణా: మండలంలోని మురహర్‌దొడ్డి గ్రామ శివారులో కురువ కతలప్ప(50) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈనెల 8న కతలప్ప ఇంట్లో గొడవపడి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం గ్రామ శివారులోని పార్థురెడ్డి పొలం పక్కన కతలప్ప మృతదేహం ఉండడంతో అటువైపు వెళ్లిన గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కతలప్ప తమ్ముడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎండీ నవీద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ఆస్పత్రికి తరలించారు.

డ్రెయినేజీలో పడి..


భవాని వెంకటేష్ (ఫైల్)

కొత్తకోట రూరల్: పట్టణంలో లాండ్రీ షాపు నిర్వహిస్తున్న భవాని వెంకటేష్(40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. భవాని వెంకటేష్ పట్టణంలో లాండ్రీషాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం స్థానిక పశువైద్య కేంద్రం దగ్గర డ్రెయినేజీలో విగతజీవిగా పడి ఉండటాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి మార్చ్యురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: అప్పుల బాధతో చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని తూడుకుర్తిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం.. తూడుకుర్తి గ్రామానికి చెందిన శ్రీరాములు(36) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి అప్పులు ఎక్కువ కావడంతో మనస్థాపానికి గురై తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. తండ్రికి ఫోన్ చేసి చనిపోతున్నానని చెప్పాడు. తండ్రితో పాటు భార్య వ్యవసాయ పొలం వద్దకు వెళ్లేలోపు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చ్యురీకి తరలించారు. తండ్రి శాంతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి: నలుగురిపై కేసు నమోదు

ఖిల్లాఘనపురం: భార్యాభర్తల మధ్య జరిగిన తగాదా గురించి మాట్లాడదామని చెప్పి దాడి చేసిన విషయంలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. మండలంలోని అప్పారెడ్డిపల్లికి చెందిన నరేష్‌కు అదే గ్రామానికి చెందిన యాదమ్మతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరు తరుచుగా గొడవలు పడుతుండడంతో.. యాదమ్మ తల్లిగారి ఇంటి వద్దే ఉంటుంది. ఈ విషయమై మంగళవారం సాయంత్రం మాట్లాడదామని చెప్పి యాదమ్మ అన్న సురేష్ నరేష్‌ను పిలిచాడు. ఇద్దరు కలిసి సల్కెలాపురం గ్రామానికి వెళ్లే రోడ్డుకు బాలెసావుల దర్గా సమీపంలో మాట్లాడుతుండగా శేషయ్య, రవికుమార్, బాలీశ్వర్ ఆటోలు వచ్చి.. నరేష్‌ను బూతులు తిడుతూ దాడి చేశారు. బుధవారం బాధితుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరిశ్రమల్లో కర్బన ఉద్గారాలు తగ్గించేలా..

పరిశ్రమల్లో కాలుష్యం కలిగించే కర్బన ఉద్గారాలను నియంత్రించేందుకు ఈ మోడల్ పనిచేస్తుంది. ప్యూరిఫికేషన్ వ్యవస్థ ద్వారా గాలిలోని కర్బన పదార్థాలను శోషించుకుని, ప్రాసెస్ చేసిన తర్వాత వాతావరణంలోకి విడుదల చేస్తారు. కర్బన ఉద్గారాలు నేరుగా కలువకుండా ఉండేందుకు పనిచేసే కార్బన్ ప్యూరిఫికేషన్ ఫర్ ఇండస్ట్రీస్ విధానాన్ని ప్రదర్శించారు.

– వాసు,
9వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్ వెనచర్ల



సహజసిద్ధమైన దూప్ స్టిక్స్ తయారీ..

వాడి పడేసిన పూలను వినియోగించి పరిమళభరితమైన హెర్బల్ దూప్ స్టిక్స్‌ను జెడ్పీహెచ్‌ఎస్ వెనచర్ల విద్యార్థులు తయారు చేశారు. పూల వ్యర్థాలకు సాబ్రాని, కర్పూరం కలిపి ఈ దూప్ స్టిక్స్ తయారు చేశారు. రసాయనాలతో చేసిన వాటితో తలనొప్పి, ఎలర్జీ, జలుబు వంటి సమస్యలు ఉండగా, ఈ దూప్ స్టిక్స్‌తో అలాంటి ఇబ్బందులు ఉండవు, దోమల నియంత్రణకు సైతం పనిచేస్తాయి.

– రజిత, జెడ్పీహెచ్‌ఎస్, వెనచర్ల, పెద్దకొత్తపల్లి



సృజనాత్మకతకు పదును

నాగర్‌కర్నూల్‌లో ప్రారంభమైన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు

- ఆకట్టుకున్న విద్యార్థులు..
- నిజజీవితంలో ఉపయోగపడేలా మోడళ్ల తయారీ

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ ప్రదర్శనలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రదర్శనలో జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు హాజరై తమ ఇన్నోవేటివ్ ప్రదర్శనలు సందర్శకులకు వివరించారు. వాటిలో విద్యార్థులు రూపొందించిన పలు సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నిత్య జీవితంలో ప్రజలకు ఉపయోగపడేలా విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలు ఈ సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శించారు.

– కందనూలు


ముష్టిపల్లి గ్రామ చెరువులో ఫ్లోటింగ్‌బోటును పరీక్షిస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఊరెళ్లినా.. మొక్కలు క్షేమం

సుమారు 20 రోజులు ఇల్లు విడిచి వెళ్లినా వచ్చేంత వరకు మొక్కలు వాడిపోకుండా ఉండేలా బెడ్ గార్డెన్‌ను రూపొందించాం. ఇందులో వినియోగించే జియో టెక్స్‌టైల్ క్లాత్ సహాయంతో అవసమైన మేరకు మాత్రమే మొక్కలకు నీటిని అందిస్తుంది. 20 రోజుల పాటు ఎవరి సహాయం లేకుండా నీరు, ఎరువులు మొక్కలకు అందుతాయి.

– వైష్ణవి, మాధవి, జెడ్పీహెచ్‌ఎస్, బిజినేపల్లి





దేశ భౌగోళిక స్వరూపం మన కళ్లముందే..

దేశంలో అన్ని రకాల భౌగోళిక స్వరూపాలను ఈ మ్యాప్‌లో చూడొచ్చు. ప్రధానంగా హిమాలయాలు, థార్ ఎడారి, నదులు, దక్కన్, చోటా నాగ్‌పూర్ పీఠభూములు, సముద్ర తీర ప్రాంతాలను తాకుతూ చూస్తూ సులభంగా అర్థం చేసుకోవచ్చు.

– ఇందు,
శాంతినికేతన్, తిమ్మాజిపేట

కారుచౌకగా కూలర్..

వేసవిలో తక్కువ ఖర్చుతో చల్లదనం లభించేలా పోర్టబుల్ బకెట్ కూలర్‌ను బిజినేపల్లి గర్ల్స్ స్కూల్ విద్యార్థిని స్నేహలత రూపొందించింది. బ్యాటరీ సహాయంతో నడిచే ఈ కూలర్‌ను ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. దీని తయారీకి కేవలం రూ.400 మాత్రమే ఖర్చయింది.

– స్నేహలత,
బాలికల హైస్కూల్, బిజినేపల్లి



వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన



పట్టణాలు, గ్రామాల్లో నిత్యం వెలువడే వ్యర్థాలను సరైన విధంగా వినియోగించుకునేందుకు ఈ మోడల్ రూపొందించాం. తడి, పొడి చెత్త సేకరణ, ప్లాస్టిక్ సెగ్రిగేషన్, ప్లాస్టిక్ రీసైకిల్ విధానాలు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– హర్షిత, కేజీబీవీ, పెంట్లవెల్లి

వరదల్లో రక్షించే సేఫ్టీ బోటు..



వరదలు, నీటి ముంపు ప్రాంతాల్లో ప్రజల ప్రాణాలు వెంటనే కాపాడేలా ముష్టిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు సాయిచరణ్, ప్రవీణ్ ఈ ఫ్లోటింగ్ బోటును తయారు చేశారు. ఏ మాత్రం ఖర్చు లేకుండా ఖాళీ నీటి బబూల్‌ను వినియోగించి ఈ బోట్‌ను తయారు చేయడం విశేషం. కేవలం 20 నిమిషాల్లోనే కర్రలు, తాడు, ఖాళీ నీటి డబ్బాల సహాయంలో దీన్ని తయారు చేసుకోవచ్చు. ఈ విద్యార్థులు ఇప్పటికే తమ గ్రామంలోని చెరువులో ఈ బోటును ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు.

– సాయిచరణ్, ప్రవీణ్,
జెడ్పీహెచ్‌ఎస్ ముష్టిపల్లి, పెద్దకొత్తపల్లి

రేషన్ బియ్యం పట్టివేత

కోస్గి రూరల్: రేషన్ బియ్యం పట్టుకొని కేసు నమోదు చేసిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని అంతారం గ్రామానికి చెందిన మల్లేష్ కోస్గి మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వాహనంలో తరలిస్తున్నాడు. ఈ సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర వాహనాన్ని ఆపి తనిఖీ చేసి 20.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. పంచనామా అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ ఫిర్యాదు మేరకు వాహనాన్ని సీజ్ చేసి మల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని గోదాంకు తరలించామని తెలిపారు.

బంగారు, వెండి, నగదు చోరీ

గద్వాల క్రైం: తాళం వేసిన ఇంట్లోకి గుర్తు తెలియని దుండగులు చొరబడి బంగారు, వెండి, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు ఎండీ అమర్ కథనం మేరకు.. బంధువుల ఫంక్షన్ కోసం ధరూర్ మండలంలోని ఉప్పేర్ గ్రామానికి కుటుంబ సభ్యులతో కలిసి ఎండీ అమర్ మంగళవారం వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటికొచ్చి చూడగా, తలుపులు తెరిచి ఉండడంతో ఇంట్లో వెళ్లి బీరువా చూశాడు. అందులో ఉన్న మూడుతులాల బంగారు, 18 తులాల వెండి ఆభరణాలు, రూ.18 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్ కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మరికల్: మండలంలోని తీలేర్ స్టేజీ దగ్గర గుర్తు తెలియని వృద్ధుడు(60) మంగళవారం అర్ధరాత్రి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఈ విషయాన్ని బుధవారం గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని ఎవరైనా గురిస్తే మరికల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ రాము తెలిపారు.

వివాహిత బలవన్మరణంపై విచారణ


ఆత్మహత్య చేసుకున్న ఇంట్లో కల్లు బాటిళ్లను గుర్తించిన డీఎస్పీ సత్యనారాయణ


స్థానికుల నుంచి వివరాలను తెలుసుకుంటున్న డీఎస్పీ

- వరకట్న వేధింపుల కేసు నమోదు

గద్వాల క్రైం: మల్దకల్ మండలం మద్దెలబండ గ్రామానికి చెందిన బోయ పవిత్ర (23) అదే గ్రామానికి చెందిన కమ్మరి వినయ్‌ని రెండేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నది. మంగళవారం ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందిన సంఘటనపై బుధవారం గద్వాల డీఎస్పీ సత్యనారాయణ విచారణ చేపట్టారు. భీమ్‌నగర్‌లో వారు ఉంటున్న అద్దె ఇంటికి వెళ్లి ఆమె ఆత్మహత్యకు గల వివరాలను యాజమానులు, స్థానికులను ఆరా తీశారు. ఇంటి బయట కల్లు బాటిల్ గుర్తించారు. మత్తు కలిపిన కల్లు, నిషేధిత పదార్థాలతో తయారు చేసిన కల్లు అనే అంశాలపై విచారణ చేపట్టారు. వినయ్ కార్పెంటర్‌గా ఎక్కడ పని చేస్తున్నాడు? ఎన్ని ఏళ్లుగా ఆమెతో సంబంధం ఉందనే విషయాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వివాహమైనప్పటి నుంచి వరకట్నం కోసం వినయ్, వారి కుటుంబ సభ్యులు వేధింపులకు పాల్పడినట్లు పవిత్ర తమ కుటుంబ సభ్యులకు చెప్పేదని డీఎస్పీకి తెలిపారు. వివిధ అంశాలపై విచారణ అనంతరం ఆమె తండ్రి బోయ శంకర్ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అనంతరం గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్, వైద్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. త్వరలో నిందితులను అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ పేర్కొన్నారు.

ఆరుతడి పంట సాగుచేద్దాం

- ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి
- తక్కువ పెట్టుబడి, ఎక్కువ దిగుబడి

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగులో అన్నదాతలు అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. పంట సాగు చేసిన తర్వాత వాటిని అమ్ముకోవడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో అనేక మంది రైతులు పత్యామ్నాయ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రైతులు ఆరుతడి పంటలు సాగు చేయడం లాభసాటిగా ఉంటుంది. ఒక ఎకరం వరి పంట సాగుకు కావాల్సిన నీటితో కనీసం 3 నుంచి 4 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేయవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. తక్కువ విద్యుత్, పంట మార్పిడికి ఆపరాలు సాగు చేస్తే భూసారం మెరుగవుతుందని ఏడీఏ పేర్కొన్నారు. ఆపరాలల్లో తక్కువ కాలపరిమితితో పెసర, మినుము రకాలు సాగు చేసుకోవచ్చు. ఈ పంట త్వరగా పెరిగి పక్కలకు వ్యాపించ గలవు.

పెసర రకాలు..
డబ్ల్యూజీఎల్–42, 37, ఎంజీజీ 295, 347, 348, 351 ఈ రకాలు దాదాపు 70 నుంచి 75 రోజుల్లో కోతకు వస్తాయి. ఎకరాకు సుమారు 5 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది.

మినుముల రకాలు..
డబ్ల్యూబీజీ 26, ఎల్‌బీజీ–20, 623, 752, 787, పీయూ–31 రకాలు దాదాపు 80 నుంచి 85 రోజులలో కోతకు వస్తాయి. ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్లు దిగుబడి వస్తోంది.


మినుము పంట

విత్తన మోతాదు..
నాగటి సాలల్లో వేస్తే లేదా సీడ్ డ్రీల్‌తో వేసే ఎకరానికి 8 కిలోలు అవసరం. వెదజల్లే పద్ధతిలో 12 నుంచి 14 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. సాలుకు సాలుకు మధ్య 30 సెం.మీ.లు మొక్కల మధ్య 10 సెం.మీ. దూరం ఉండేలా చూసుకోవాలి.

విత్తన శుద్ధి..
కిలో విత్తనానికి 30 గ్రాముల కార్బో సల్ఫాన్ మందులు పట్టించి విత్తన శుద్ధి చేసుకోవాలి.

ఎరువులు..
దుక్కిలో 40 కిలోల డీఏపీ ఎకరానికి వేసుకోవాలి.

కలుపు నివారణ..
విత్తిన 48 గంటల్లో పెండి మిథాలిన్ అనే కలుపు మందు ఎకరానికి 1.5 లీటర్లు, 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

నీటి యాజమాన్యం..
విత్తిన 20 రోజులకు, 40 రోజులకు, పూత, కాత దశలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. సక్రమ నీటి యాజమాన్యానికిగాను చేనులో చిన్న చిన్న మడులుగా విభజించి ఒకటి తర్వాత ఒకటి పారించడం మంచిది.

సస్యరక్షణ..
కాండపు ఈగ, తామర పురుగుల నివారణకు ఎసీఫేట్ 350 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- తెల్ల దోమ నివారణకు ట్రయజోఫాస్ 400 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలుపుకొని ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలి.
- కాండం తొలిచే పురుగు మారుక, మచ్చల పురుగు, లద్దె పురుగు నివారణకు స్పైనోశాడ్ 75 గ్రాములు, ఇండాక్సికార్బ్ 200 మీ.లీ, నువాలురాన్ 300 మి.లీ డైఫ్లూబెంజురాన్ 30 మి.లీ, ఎమార్టిన్ బెంజోమెట్ 100 గ్రాములు, 200 లీటర్లు నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేసుకోవాలి.

బూడిద తెగులు..
పంట విత్తిన 40 రోజుల తర్వాత గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ముదురు ఆకులపై బూడిద రంగులో చిన్న చిన్న మచ్చలుగా కనబడి క్రమేణా కొమ్మలు కాయలకు వ్యాపిస్తుంది.
నివారణ చర్యలు :
అజాక్సి స్ట్రోబిన్ 200 మి.లీ, ట్రెడిమార్ఫ్ 200 మి.లీ, హెక్జాకొనజోల్ 400 మి.లీ, మైకోబు టానిల్ 250 మి.లీ 200 లీటర్ల నీటిలో కలుపుకొని ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలి.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం

వివిధ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మిడ్జిల్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామ్‌ప్రకాష్, లవకుశ బైక్‌పై వెళ్తూ లారీని ఢీకొట్టారు. జడ్చర్ల నుంచి బైక్‌పై లింగంపేట వెళ్తున్న మాజీ సర్పంచ్ కృష్ణయ్యగౌడ్ అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. నవాబ్‌పేట మండలం పోమాల్‌కు చెందిన రాజు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. మక్తల్ మండలం కాచ్‌వార్ వద్ద రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొట్టడంతో గిడ్డయ్యగౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

లింగంపేట మాజీ సర్పంచ్ దుర్మరణం


కృష్ణయ్యగౌడ్ (ఫైల్)

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో లింగంపేట గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణయ్యగౌడ్(45) దుర్మరణం చెందిన సంఘటన మండలంలో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. గంగాపూర్–బాలానగర్ డబుల్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కల్వర్టు పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జడ్చర్ల నుంచి లింగంపేటకు మోటార్ బైక్‌పై వెళ్తున్న కృష్ణయ్యగౌడ్ గంగాపూర్–లింగంపేట మధ్య కల్వర్టు వద్ద మట్టికుప్పను ఢీకొట్టి పది అడుగుల లోతులో కాంక్రిట్‌పై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇక్కడే మరో ప్రమాదం..
అంతకు ముందే స్థానిక ఇందిరానగర్ కాలనీకి చెందిన యువకుడు బన్నీ లింగంపేట వైపు నుంచి జడ్చర్ల వైపు వస్తుండగా ఇదే కల్వర్టు దగ్గర ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వైద్యం కోసం 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



నవాబుపేట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. పోమాల్ గ్రామానికి చెందిన మందుల రాజు(34) బుధవారం మండల కేంద్రానికి సొంత పని నిమిత్తం వచ్చాడు. తిరిగి ఇంటికి రాత్రి కాలినడకన వెళ్తుండగా చింతలకుంట దగ్గర గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొద్దిసేపటికి అటు వైపు వెళ్తున్న వారు గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. రాజు గతంలో ఆర్టీసీలో ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేసినట్లు సమాచారం.

రేవల్లి గేట్ సమీపంలో ఇద్దరు..


రామ్‌ప్రకాష్ (ఫైల్)

ఊర్కొండ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామ్‌ప్రకాష్ (32), లవకుశ (31) మిడ్జిల్‌లో నివాసం ఉంటున్నారు. రోజు వారీగా కల్వకుర్తి పట్టణంలో పనులు ముగించుకొని బైక్‌పై మిడ్జిల్ వస్తున్న క్రమంలో కల్వకుర్తి–జడ్చర్ల ప్రధాన రహదారిపై రేవల్లి గేటు సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు దాటుతూ..
మక్తల్: బతుకు దెరువు కోసం కూలిపనులకు వచ్చిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం రాత్రి మక్తల్ మండలంలో చోటుచేసుకుంది. కర్నూల్ జిల్లా కోస్గి మండలం పల్లెపాడు గ్రామానికి చెందిన గిడ్డయ్యగౌడ్ (40) భార్య ఈడిగి లక్ష్మి, ముగ్గురు పిల్లలతో మక్తల్ మండలం కాచ్‌వార్ గ్రామానికి బతుకుదెరువు కోసం వచ్చాడు. గిడ్డయ్యతో పాటు మురళి, నాగయ్య, గిడ్డయ్యగౌడ్ కలిసి రోడ్డు దాటి షాపుల్లో పాల పాకెట్లు తీసుకొని తిరిగి రోడ్డు దాటుతుండగా, హైదరాబాద్ నుంచి వస్తున్న బస్సు ఢీ కొట్టడంతో గిడ్డయ్యగౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈడిగి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

జనాభాకనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలి



మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్

నాగర్‌కర్నూల్ రూరల్: పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన డీహెచ్‌పీఎస్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పుడు ఆనాటి జనాభా ప్రాతిపదికన ఎస్సీల రిజర్వేషన్లు 15 శాతం అమలు చేశారని, ప్రస్తుతం పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాయితీలలో ప్రైవేటు సంస్థలలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని, వాటి అమలుకు పార్లమెంట్‌లో చట్టం తీసుకువచ్చి చట్టబద్ధత కల్పించాలని కోరారు. అలా కాకుండా ప్రస్తుత ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు కొన్ని కుల సంఘాలను ప్రోత్సహిస్తూ వారి మధ్య కలహాలు పెంచి రిజర్వేషన్లు ఎత్తివేసే ధోరణిలో ఉన్నాయని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి లక్ష్మీపతి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ, సరళీకరణ, ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేయడం వల్ల ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా దళితుల అభివృద్ధికి అడ్డంకిగా మారిందని, తక్షణం ప్రైవేటీకరణను ఆపి న్యాయం చేయాలన్నారు. 2025 జనవరి 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే అఖిలభారత దళిత హక్కుల ఉద్యమం రెండో జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను, జిల్లా కౌన్సిల్ సభ్యులు బాలు, శ్రీను, శివశంకర్, ఊశన్న, కృష్ణయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయంలోకి 5,846 క్యూసెక్కులు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో 24గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 5,486 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,617, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 2.492 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. బుధవారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 864.1 అడుగుల వద్ద 119.1976 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

10 వేల మంది అయ్యప్పస్వాముల గిరి ప్రదక్షిణ

ఆలయ చరిత్రలోనే మొదటిసారి


యాదగిరి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేస్తున్న అయ్యప్ప స్వాములు

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం అయ్యప్ప మాలధారణ స్వాముల సందడి నెలకొంది. ఏకాదశి, గీత జయంతిని పురస్కరించుకొని స్థానిక అయ్యప్ప స్వాములతో పాటు తెలంగాణ నలుమూలలు, వివిధ రాష్ట్రాలకు చెందిన 10 వేల మందికి పైగా మాలధారణ స్వాములు శ్రీస్వామి వారి కొండ చుట్టూ గిరిప్రదక్షిణ చేపట్టారు. అయ్యప్ప మాలధారణ స్వాములు ఇంత పెద్దఎత్తున గిరి ప్రదక్షిణ చేయడం ఆలయ చరిత్రలో ఇదే మొదటిసారి. మంగళవారం రాత్రి నుంచే పలు జిల్లాలు, రాష్ట్రాల నుంచి అయ్యప్ప మాలధారణ స్వాములు యాదగిరిగుట్టకు చేరుకున్నారు. వేకువ జామునే వైకుంఠద్వారం వద్దకు అయ్యప్పలు భారీగా చేరుకొని శ్రీలక్ష్మీనరసింహస్వామికి, పల్లకిలో అధిష్టించిన అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఈఓ భాస్కర్‌రావు ప్రత్యేక పూజలు చేసి, గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. గిరి ప్రదక్షిణ మార్గమంతా అయ్యప్ప మాలధారణ స్వాములతో నిండిపోయింది. నారసింహుడు, అయ్యప్ప నామ స్మరణలతో అధ్యాత్మికతను సంతరించుకొంది. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న మాలధారణ స్వాములంతా మెట్ల మార్గంలో కొండపైకి చేరుకున్న తర్వాత.. రూ.150 వీఐపీ దర్శనం మార్గంలో ప్రధానాలయంలోకి వెళ్లి గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకున్నారు. గిరి ప్రదక్షిణలో పాల్గొని, శ్రీస్వామిని దర్శించుకున్న మాలధారణ స్వాములకు భాస్కర్‌రావు ప్రత్యేక ప్రసాదాన్ని అందజేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయ పరిసరాల్లో ఎటు చూసినా అయ్యప్ప మాలధారణ స్వాములే కనిపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాగ్రహం వల్లే డైవర్షన్ పాలిటిక్స్

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు

- చంద్రబాబు అబద్ధాలు మోసాలుగా మారాయి
- అవే ప్రజల్లో కోపంగా మారుతున్నాయి
- మా పథకాలెందుకు ఇవ్వట్లేదని ప్రజలు నిలదీస్తున్నారు
- ప్రజలకు సమాధానం చెప్పలేకే ప్రతి నెలా ఏదో ఒక అంశంపై గోబెల్స్ ప్రచారం

సాక్షి, అమరావతి: 'ప్రజలకు అబద్ధాలు చెబితే అది మోసం అవుతుంది. అది ప్రజల్లో కోపం కింద మారుతుంది. ఆ కోపమే చంద్రబాబు పాలనపై ప్రజల్లో ఇప్పుడు విపరీతంగా కనిపిస్తోంది' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీల అమలు ఏమైందని ప్రజలు నిలదీస్తుండటంతో సమాధానం చెప్పలేని టీడీపీ పెద్దలు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని దెప్పి పొడిచారు. 'జూన్‌లో రుషికొండ భవనాలు అని, జూలైలో శ్వేతపత్రాలు అని, మదనపల్లె ఫైల్స్ అని, ఆగస్టులో ముంబై నటి కాదంబరి జెత్వానీ అని, సెప్టెంబర్‌లో ప్రకాశం బ్యారేజీని బోట్లతో ఢీకొట్టి కూలగొట్టాలన్న కుట్ర చేశామని, అక్టోబర్‌లో నా కుటుంబాన్ని తెచ్చి, నవంబర్‌లో బడ్జెట్‌పై దృష్టి మరలించడానికి రూ.14 లక్షల కోట్లు అప్పు అని డైవర్షన్ చేశారు. ఇప్పుడు డిసెంబర్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా అంటూ నానా హంగామా చేస్తూ, దుష్ప్రచారం చేస్తున్నారు'అని ఎత్తి చూపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన ఉమ్మడి ప్రకాశం జిల్లా పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశమై.. భవిష్యత్ కార్యాచరణపై వారికి దిశా నిర్దేశం చేశారు. నిత్యం ప్రజలతో మమేకమవుతూ.. వారి పక్షాన ప్రభుత్వంపై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. 'యుద్ధం గతంలోలా లేదు. మనం చంద్రబాబుతోనే యుద్ధం చేయడం లేదు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, ఎల్లో మీడియాతోనూ పోరాటం చేస్తున్నాం. వీటికి తోడు చెడిపోయిన ఐ-టీడీపీతో యుద్ధం చేస్తున్నాం. వీరంతా నిత్యం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. వీళ్లు ప్రజలకు చేసిన మంచి చెప్పుకోవడానికి ఏమీ లేదు. బురద జల్లడమే పనిగా పెట్టుకున్న వారితో మనం యుద్ధం చేస్తున్నాం. అబద్ధాలు చెప్పడం, వక్రీకరణ చేయడం, దుష్ప్రచారం చేయడాన్ని ఒక పనిగా పెట్టుకున్నారు. దీన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది'అని నేతలకు ఉద్బోధించారు. 'ప్రతి ఒక్కరికీ సోషల్ మీడియా ఎక్కౌంట్ ఉండాలి. అన్యాయం జరిగితే దాన్ని కచ్చితంగా ప్రశ్నించాలి. ఎక్కడ అన్యాయం జరిగినా ఫోటో తీసి ప్రశ్నించాలి. ఎందుకు అమ్మఒడి రావడం లేదు? మా విలేజ్ క్లినిక్ పరిస్థితి ఎందుకు ఇంత దారుణంగా ఉంది? ఇలా అన్ని సమస్యలపై ఫోటోలు తీసి అప్ లోడ్ చేయాలి. తద్వారా ప్రజలకు దగ్గర కావాలి'అంటూ నేతలకు దిశా నిర్దేశం చేశారు. 'ఎన్నికలు అయిపోయి ఆరు నెలలు దాటింది. ఈ పరిస్థితుల్లో పార్టీని మనం మళ్లీ సమాయత్తం చేసే దిశగా అడుగులు వేస్తూ ఇవాళ కలుస్తున్నాం. ఆరు నెలల్లో ఇంత వ్యతిరేకత ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం మీద లేదు. కేవలం చంద్రబాబునాయుడు పాలనలో మాత్రమే ఇలాంటి పరిస్థితి చూస్తున్నాం'అన్నారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబు బాదుడే బాదుడు

ఈ డైవర్షన్ పాలిటిక్స్ మధ్య ఈరోజు మనం పార్టీ బలోపేతం చేయడంతో పాటు, ప్రజల తరఫున పోరాటం చేయడానికి సన్నద్ధం అయ్యాం. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలన్నీ నాశనమయ్యాయి. మరో వైపు బాదుడే బాదుడు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ లేవు. వ్యవస్థలన్నీ పూర్తిగా దిగజారిపోయాయి. కరెంటు బిల్లులు ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. రూ.6 వేల కోట్ల బాదుడుతో మొదటి డోసు ఇది. నవంబరు, డిసెంబరు బిల్లుల్లో ఏ ఇంటికి వెళ్లినా రూ.300 కనీసం తేడా కనిపిస్తోంది. రానున్న నెలలో మరో రూ.9 వేల కోట్ల భారం వేస్తున్నారు. ఊళ్లలో రోడ్డెక్కితే చాలు డబ్బు కట్టాల్సిందేనట.

పోరు బాట దిశగా అడుగులు

అందుకే మనందరం పోరుబాట పట్టాల్సిందే. ఈ నెల 13న అన్నదాతలకు అండగా సమస్యలపై కార్యక్రమం పెట్టాం. ఈనెల 27న కరెంటు చార్జీల మీద మరో కార్యక్రమం చేస్తున్నాం. జనవరి 3వ తేదీన ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం మరో కార్యక్రమం చేస్తున్నాం. అలాగే పార్టీని మనం మరింత బలోపేతం చేయాలి. దీన్ని వ్యవస్థీకృత విధానం (ఆర్గనైజ్డ్ స్ట్రక్చర్)లోకి తీసుకురావాలి. ఇందులో భాగంగా పార్టీలో క్రియాశీల మార్పులు తీసుకు వచ్చాం. సంక్రాంతి తర్వాత ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో బుధ, గురువారాల్లో ఉంటాను. అవసరాన్ని బట్టి శుక్రవారం కూడా ఉండేలా ప్లాన్ చేస్తున్నాను. 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం'పేరుతో ఈ కార్యక్రమంలో పాల్గొంటాను. నా కార్యక్రమం ప్రారంభమయ్యేలోపు జిల్లా కమిటీలు, నియోజకవర్గ కమిటీలు, మండల స్థాయి కమిటీలు పూర్తి చేయాలి. సంక్రాంతి లోపే అవన్నీ పూర్తి కావాలి. నా కార్యక్రమం మొదలైన తర్వాత మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కమిటీలు పూర్తి చేద్దాం.

'ఫ్రెండ్లీ మహిళ'కు జాతీయ పురస్కారం

- దేశంలోనే ఉత్తమ పంచాయతీగా చిల్లపల్లి
- రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష



రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని: పెద్దపల్లి జిల్లా మంథని మండలం చిల్లపల్లి గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యుల పనితీరుకు జాతీయస్థాయి పురస్కారం లభించింది. ఫ్రెండ్లీ ఉమెన్ విభాగంలో జాతీయ స్థాయిలో చిల్లపల్లి ఉత్తమ పంచాయతీగా ఎంపికవడంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. కలెక్టర్‌తోపాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 2022–23 సంవత్సరంలో మహిళా ఫ్రెండ్లీ పంచాయతీల్లో చిల్లపల్లి గ్రామం దేశంలోనే గుర్తింపు పొందింది.

పనితీరుకు పట్టం..

చిల్లపల్లి గ్రామంలోని ఆరేళ్ల వయసుగల పిల్లలందరినీ ఐసీడీఎస్‌లో నమోదు చేయడం, గ్రామసభల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం, స్వశక్తి మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయించడం, మాతాశిశు మరణాల శాతం తగ్గడం, బాలికల విద్యకు ప్రోత్సాహం అందించడం తదితర కార్యక్రమాలు అమలు చేయడంలో చిల్లపల్లి గ్రామ మహిళలు అగ్రస్థానంలో నిలిచారు. దీంతో మహిళా ఫ్రెండ్లీ గ్రామంగా ఎంపికైన చిల్లపల్లికి రూ.65 లక్షల నగదు బహుమతి లభించింది. కాగా, ఈ నిధులను గ్రామాభివృద్ధికే వెచ్చిస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో మహిళల అభ్యున్నతి కోసం పనులు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు.

భారత్ గౌరవ్ అయోధ్య- కాశీ

యాత్ర రైలు ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: భారత్‌గౌరవ్ 'అయోధ్య – కాశీ పుణ్య క్షేత్ర యాత్ర' 26వ టూరిస్ట్ రైలు బుధవారం సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ప్రారంభమైంది. యాత్రకు బయలుదేరిన ప్రయాణికుల్లోని డాక్టర్ టి. విఠల్‌రెడ్డి, టి.కుసుమలు ఈ రైలును ప్రారంభించారు. ఐఆర్‌సీటీసీ జనరల్ మేనేజర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అయోధ్య – కాశీ పుణ్యక్షేత్ర యాత్రలో భాగంగా యాత్రికులు గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లలోని దివ్య క్షేత్రాలను సందర్శించనున్నారు. ఈ నెల 20 వరకు ఈ పర్యటన కొనసాగనుంది. భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లకు ప్రయాణికుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ హర్షం వ్యక్తం చేశారు.

త్వరలో మహా కుంభ పుణ్యక్షేత్ర యాత్ర..

ఐఆర్‌సీటీసీ మహాకుంభ పుణ్యక్షేత్ర యాత్ర పేరిట త్వరలో మరో భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును అందుబాటులోకి తేనుంది. పూర్తి వివరాలకు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ http://www.irctctourism. comను సందర్శించవచ్చు, లేదా 040– 27702407, 9701360701లను సంప్రదించవచ్చు.

'సైబర్' ఉచ్చులో అంగన్‌వాడీలు



మరికల్: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఇద్దరు అంగన్‌వాడీ టీచర్లు పడి డబ్బులు పోగొట్టుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలను పరిశీలిస్తే.. సైబర్ నేరగాళ్లు పక్కా ప్లాన్‌తో అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు, గర్భిణీ, బాలింతల పేర్లను సేకరించి, మొదట మరికల్‌లో 4వ అంగన్‌వాడీ టీచర్‌కు 967788833, 8697018824 నంబర్ నుంచి ఫోన్ చేశారు. రాష్ట ఐసీడీసీ ప్రధాన సెంటర్ నుంచి మాట్లాడుతున్నామంటూ 'మీ సెంటర్‌కు వస్తున్న కొందరి పేర్లను చేపుతున్నాం, వారందరికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం ఇస్తున్నారా? లేదా' అంటూ లైన్‌లో పెట్టి వారి వివరాలు చూస్తున్నామని చెబుతుండగానే ఆమె బ్యాంకు అకౌంట్ నుంచి రూ.3 వేలు చేశారు. ఇదే తరహాలో నారాయణపేటలో అంగన్‌వాడీ టీచర్ ఫోన్ ట్రాప్ చేసి రూ.25 వేలు డ్రా చేశారు. వెంటనే తేరుకున్న వీరు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్టోన్ క్రషర్ యూనిట్‌కు కరెంట్ కట్

- భూగర్భ గనులశాఖ అధికారుల చర్యలు
- టీజీఎస్ పీడీసీఎల్‌కు ఉత్తర్వులు జారీ


జడ్చర్ల శివారులో కొనసాగుతున్న స్టోన్ క్రషర్

జడ్చర్ల: జడ్చర్ల శివారులో నిబంధనలకు విరుద్ధంగా క్వారీలను కొల్లగొట్టి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టిన వ్యవహారంపై రాష్ట భూగర్భ గనులశాఖ అధికారులు దశల వారీగా చర్యలు చేపట్టారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని చెల్లించకుండా నిబంధనలకు విరుద్ధంగా క్వారీ యజమానులు వ్యవహరించినట్లు అధికారులు తేల్చారు. విచారణ అనంతరం సంబంధిత యజమానులకు జరిమానా విధిస్తూ షోకాజ్, డిమాండ్ నోటీసులు జారీ చేశారు. అయినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో స్టోన్ క్రషర్ యూనిట్‌కు విద్యుత్ సరఫరాను నిలిపేయాల్సిందిగా సంబంధిత విద్యుత్‌శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది.

ఖజానాకు గండి

జడ్చర్ల మండలం శంకరాయపల్లి శివారులోని సర్వే నంబర్ 28లో 4.280 హెక్టార్లలో స్టోన్‌క్రషర్ భూగర్భగనుల శాఖ నుంచి అనుమతితో క్వారీ తవ్వకాలు, స్టోన్‌క్రషర్ యూనిట్‌ను నిర్వహిస్తున్నారు. మెటీరియల్ తరలింపులో నిబంధనలు పాటించడం లేదని అధికారుల విచారణలో బయటపడడంతో నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి జరిమానా విధించారు. అయినా స్పందించక పోవడంతో స్టోన్ క్రషర్ యూనిట్‌కు విద్యుత్ సరఫరా నిలిపేయాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా మైనింగ్ ఏడీ సంజయ్‌కుమార్ టీజీఎస్‌పీడీఎస్ మహబూబ్‌నగర్ ఎస్ఈకి మంగళవారం ఉత్తర్వులు పంపారు. స్థానిక తహసీల్దార్, ఎస్‌హెచ్‌ఓ జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు ఉత్తర్వులు అందజేశారు. జడ్చర్ల శివారులోని ఓ క్రషర్ యూనిట్‌కు భూగర్భ గనుల శాఖ అధికారులు రూ.21.13 కోట్లు జరిమానా విధిస్తూ ఇప్పటికే నోటీసులు జారీ చేసిన విషయం విధితమే.


విద్యుత్ శాఖకు జారీ చేసిన మైనింగ్ శాఖ ఉత్తర్వులు

పర్మిట్ ఫీజు, డీఎంఎఫ్‌టీ, ఎస్ఎంఈటీ, ఇన్‌కం ట్యాక్స్ వంటి పన్ను చెల్లింపులో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు రావలిసిన ఆదాయం రాలేదు. స్టోన్ క్రషర్ యూనిట్‌లో అనేక అక్రమాలు జరిగాయని అధికారులు గుర్తించారు. ఈ యూనిట్‌కు కూడా జరిమానా విధిస్తూ నోటీసులు జారీ చేశారు. అయినా స్పందించక పోవడంతో ఏకంగా విద్యుత్ సరఫరాను నిలిపేసేందుకు చర్యలు చేపట్టారు.


మద్దిమడుగు అంజన్న ఉత్సవాలు ప్రారంభం


యాగశాల ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్: పదర మండలంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి దీక్షమాల విరమణ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. వేదపండితులు వీరయ్య శాస్త్రి, వీరయ్యశర్మల బృందం వేద మంత్రాలతో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఆలయ కార్యనిర్వహణాధికారి రంగాచారి ఉత్సవాలను ప్రారంభించారు. ఈనెల 15వరకు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిత్యార్చన విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, ఉష్ణవాహణ సేవ, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు దీక్షమాల చేపట్టిన భక్తులు మద్దిమడుగు క్షేత్రానికి చేరుకుంటున్నారు. పదర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పదర పోలీసుస్టేషన్, అమ్రాబాద్ సీఐ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్ రాములు, కార్యనిర్వహణాధికారి రంగాచారి, ఆలయ అధికారులు నాగరాజు, విశ్వేశ్వరరెడ్డి, జంగయ్య, ప్రధాన అర్చకులు వీరయ్యశర్మ పాల్గొన్నారు. అంతకు ముందు పదర మండలం వంకేశ్వరంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు.


అగ్నిగుండం వద్ద పూజలు, భక్తుల దాసంగాలు

ఉల్లి ధర పైపైకి..


దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లిని తూకం చేస్తున్న సిబ్బంది

- గరిష్టంగా రూ.5100
- కనిష్టంగా రూ. 3100

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లిపాయల వేలంలో ధరలు మరింత పెరిగాయి. వారం వారం ఉల్లి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. దిగుబడి లేకపోవడంతో మార్కెట్‌లో ఉల్లి డిమాండ్‌కు తగ్గట్లు దొరకని పరిస్థితి ఏర్పడింది. నాణ్యమైన ఉల్లికి గతంలో ఉండే ధరలకు మించి, ప్రస్తుతం ధరలు నమోదు అవుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న ఉల్లి ఎర్రగా పచ్చిగా ఉన్నప్పటికీ ధరలు పెరుగుతూనే ఉన్నాయి.

వేలంలో వ్యాపారుల పోటీ

దేవరకద్ర మార్కెట్‌లో జోరుగా ఉల్లిపాయల వేలం జరిగింది. స్థానిక వ్యాపారులతో పాటు బయట నుంచి వచ్చిన వ్యాపారులు పోటీ పడ్డారు. ఉల్లికి డిమాండ్ ఉండడంతో ధరల విషయంలో వెనకంజ వేయకుండా వేలంలో ధరలు పెంచి కొనుగోలు చేశారు. ఎర్రఉల్లి మొదటి రకం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5100 వరకు పలికింది. గతవారంతో పోల్చితే రూ.350 పెరిగింది. కనిష్టంగా రూ.3100 వరకు రాగా, గతవారం కన్నా రూ.900 అధిక ధర పలికింది. దేవరకద్ర మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కేజీల ఉల్లి బస్తా గరిష్టంగా రూ.2600లకు విక్రయించగా, కనిష్టంగా రూ.1600 లకు అమ్మకాలు చేశారు. మధ్యస్తంగా రూ.2100లకు బస్తాగా ఉల్లి విక్రయించారు. దేవరకద్ర సంతలో కిలో ఉల్లి రూ.60లకు విక్రయించారు.

గుట్కా పాకెట్ల పట్టివేత


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

కల్వకుర్తి: పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో బుధవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా, రూ.2 లక్షల విలువైన నిషేధిత గుట్కా పాకెట్లను పట్టుకున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డిలు సిబ్బందితో కలిసి తనిఖీ చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. హైదరాబాద్ చౌరస్తా నుంచి ఆటోలో వస్తున్న వ్యక్తి పోలీసులను చూసి వెంటనే ఆటో మలిపి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో అనుమానించిన పోలీసులు ఆటోను వెంబడించి పట్టుకున్నారు. డ్రైవర్ నర్సింహ కడ్తాల్ మండలం, రంగారెడ్డి జిల్లాగా చెప్పాడు. అనంతరం ఆటోను తనిఖీ చేయగా, ఆటోకు సంబంధించిన డాక్యుమెంట్ చూపించడలేదు. ఆటోలో సంచులను తీసి చూడగా నిషేధిత గుట్కాలు ఉన్నాయి. వాటికి సంబంధించిన బిల్లులు డ్రైవర్ చూపించలేదు. గుట్కా బస్తాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాటి విలువ రూ.2 లక్షల ఉంటుందని తెలిపారు. ఈ గుట్కా బస్తాలను కల్వకుర్తి పట్టణంలోని పలు షాపుల్లో అమ్మేందుకు వచ్చినట్లు డ్రైవర్ తెలిపాడు. నిషేధిత గుట్కాలు విక్రయిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. నర్సింహపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

కోస్గి: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో గుండుమాల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్–19 వాలీబాల్ పోటీలు రెండోరోజు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. స్థానిక ఏకే అకాడమీ క్రీడామైదానంలో బుధవారం సెమీ ఫైనల్ పోటీలు నిర్వహించారు. గురువారం ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

రెండో రోజు విజేతలు..

రెండోరోజు జరిగిన పోటీల్లో మహబూబ్‌నగర్ బాలుర జట్టు మెదక్ జట్టుపై 25–12, 25–17 స్కోర్‌తో విజయం సాధించింది. హైదరాబాద్ జట్టు నల్గొండ జట్టుపై 25–19, 25–23 స్కోర్‌తో విజయం సాధించింది. ఖమ్మం జట్టు అదిలాబాద్ జట్టుపై 27–25, 25–19 స్కోర్‌తో విజయం సాధించింది. బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు ఖమ్మం జట్టుపై 15–9, 15–2 స్కోర్‌తో విజయం సాధించింది. నల్గొండ జట్టు వరంగల్ జట్టుపై 16–14, 15–7 స్కోర్‌తో విజయం సాధించింది. మహబూబ్‌నగర్ జట్టు ఆదిలాబాద్ జట్టుపై 15–3, 15–3 స్కోర్‌తో విజయం సాధించింది. కార్యక్రమంలో వాలీబాల్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాల్‌రాజ్, పీడీలు శ్రీనివాస్, నర్సింహులు, రాధిక, స్వప్న, పుష్పలత పాల్గొన్నారు.


పోటీ పడుతున్న బాలికల జట్టు